ప్రజాశక్తి

శనివారం 26 ఆగస్టు 2023

8 పేజీలు


విశాఖపట్నం


అనకాపల్లి

సగం పనులే..

◆ అసంపూర్తిగా సచివాలయ, రైతు భరోసా, ఆరోగ్య కేంద్ర భవనాలు
◆ వెంటాడుతున్న నిధుల సమస్య
◆ 1972 భవనాలకు 769 మాత్రమే పూర్తి


తిమ్మరాజుపేటలో అసంపూర్తిగా రైతు భరోసా కేంద్రం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, నర్సీపట్నం, అచ్యుతాపురం విలేకరులు

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో నిధుల సమస్యతో గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణ పనుల్లో జాప్యం చోటుచేసుకుంటోంది. ప్రభుత్వ పదవీకాలం పూర్తయ్యేలోపు పనులు అయ్యేలా కనిపించడంలేదు. 2019-20లో భవన నిర్మాణాలకు పరిపాలనా ఆమోదం లభించినా నిధుల కొరతతో సకాలంలో నిర్మాణ పనులు పూర్తిచేయలేని పరిస్థితి ఏర్పడింది. పనులు పూర్తిచేశాక బిల్లు పెట్టిన మూడు నెలలకు కూడా డబ్బులు రాకపోవడంతో పెట్టుబడి పెట్టుకోలేక కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. ప్రభుత్వ యంత్రాంగం నుంచి ఎంత ఒత్తిడివున్నా నిర్మాణ పనులు పూర్తిచేయడానికి కాంట్రాక్టర్లు ఆసక్తి చూపలేదు. దీంతో మంజూరైన పనుల్లో భవన నిర్మాణ పనులు సగం కూడా పూర్తికాలేదు. జిల్లాలో రూ.508.50 కోట్లతో 1972 భవన నిర్మాణాలు పూర్తిచేయాల్సివుంది. కానీ ఇంతవరకు రూ.251.79 కోట్లు ఖర్చుచేసి 769 భవన నిర్మాణ పనులు మాత్రమే పూర్తిచేశారు. మిగిలిన పనులు వివిధ స్థాయిల్లో ఉన్నాయి. నిధుల సమస్యకు తోడు ఇసుక సమస్య తోడవడంతో నిర్మాణ పనులను అనుకున్న సమయానికి పూర్తిచేయలేకపోతున్నట్లు మిగతా 2లో..


అసంపూర్తిగా పప్పుశెట్టిపాలెం సచివాలయ భవనం


ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

సిఎం జగన్‌కు ఘన స్వాగతం, వీడ్కోలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి విజయనగరం జిల్లా చినమేడపల్లి గ్రామంలో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం ఉదయం ప్రత్యేక విమానంలో విజయవాడ నుంచి విశాఖ విమానాశ్రయానికి రాగా అతనికి ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమలు, ఐటి కమ్యూనికేషన్ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, టిటిడి మాజీ చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవివి.సత్యనారాయణ, బి.సత్యవతి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, డిసిసిబి చైర్మన్ కోలా గురువులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, జివిఎంసి కమిషనర్ సాయి కాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, ఆర్‌డిఓ హుస్సేన్ సాహెబ్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం సిఎం ప్రత్యేక హెలికాప్టర్‌లో ఉదయం 10.20 గంటలకు విజయనగరం జిల్లాకు బయలుదేరారు.

అలాగే విజయనగరం పర్యటన ముగించుకొని ప్రత్యేక హెలికాప్టర్‌లో తిరిగి మధ్యాహ్నం 1.40 గంటలకు మిగతా 2లో..

ఆర్థిక ఇబ్బందులతో భార్యాభర్తలు ఆత్మహత్య

▶ వార్త మెయిన్‌లో..

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త సుమా..

▶ వార్త 2లో..

ఆర్ఎస్ ఛానల్‌కు నీరు విడుదల

▶ వార్త 5లో..



విశాఖలో జోరు వాన

విశాఖ నగరంలో శుక్రవారం సాయంత్రం జోరు వాన కురిసింది. గాజువాక, కూర్మన్నపాలెం, వడ్లపూడి, ఆటోనగర్, పెందుర్తి తదితర చోట్ల హోరుగాలి వీచింది. జోరువానలోనే నగర వాసుల ప్రయాణాలు సాగాయి. లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది.

కబ్జాల చిట్టా చేతిలో ఉన్నా నేలచూపులా..

◆ రూ.వందల కోట్ల విలువైన భూములపై జివిఎంసి, రెవెన్యూ అశ్రద్ధ ◆ హైకోర్టు ఆదేశాలూ బేఖాతరు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ప్రభుత్వ భూములు, గ్రామ కంఠాలు, చెరువులు, గెడ్డలు, నీటి కుంటలు, శ్మశానాలు తదితర వాటిలో జరిగిన అక్రమ, అనధికార నిర్మాణాలను కూల్చేయాల్సిందే..' - హైకోర్టు 2022 సెప్టెంబర్ 14న జారీ చేసిన ఉత్తర్వుల సారాంశమిది. ఒకవేళ 30 ఏళ్లు దాటితే వాటిని క్రమబద్ధీకరించి నేడున్న ధరలకు తగ్గట్టుగా పెనాల్టీలు వేయాల్సిందేని ఆ ఉత్తర్వుల్లో వెల్లడించినా రెవెన్యూ, జివిఎంసి యంత్రాంగంలో కదలిక లేదు. భూ కబ్జాలు, దురాక్రమణల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. భూ కుంభకోణాలు, ట్యాంపరింగులపై గత టిడిపి ప్రభుత్వం వేసిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని తొక్కిపట్టేసి కొత్తగా సిట్ వేసిన వైసిపి తమ నివేదికనూ బయటపెట్టకుండా నేలచూపులు చూడడం విశాఖలో విడ్డూరం.

భూ దురాక్రమణల చిట్టా ఇదే..

నగరంలో గాజువాక, పెందుర్తి, మధురవాడ, రుషికొండ, సాగర్‌నగర్, ఎండాడ ఇలా ఎక్కడ చూసినా ప్రభుత్వ భూములు, గ్రామ కంఠాలు, చెరువులు, గెడ్డలు దురాక్రమణకు గురయ్యాయి. ప్రజావసరాలకు ఉపయోగించే పార్కులు, ప్రజోపయోగ ప్రభుత్వ భూములు ఎక్కడ ఆక్రమణలకు గురైనా ఆయా ప్రభుత్వ శాఖలు కలుగజేసుకుని వాటిని స్వాధీనం చేసుకోవాలని హైకోర్టు ఆర్డర్ వేసినప్పటికీ రెవెన్యూ ఉన్నతాధికారులు మిన్నకుండిపోతున్నారు. ఎండాడ, సాగర్‌నగర్‌లో 57 నుంచి 62 సర్వే నెంబర్ల వరకూ, 122 నుంచి 125 వరకూ, 100 అలాగే 150 సర్వే నెంబర్లలో వంద ఎకరాల ప్రభుత్వ గెడ్డలు దురాక్రమణదారుల చేతుల్లో ఉన్నాయి. సర్వే నెంబరు 57/2లో సుమారు 6 ఎకరాలకు సంబంధించి ప్రభుత్వం కోర్టులో కేసు వేసి తమ భూమిగా గెలుచుకున్నా కబ్జాదారులు ఇంకా దీన్ని విడువడం లేదు. ప్రభుత్వం నిర్మించిన గోడను కూడా వీళ్లు బద్దలు కొట్టిన పరిస్థితి సాగర్‌నగర్ ప్రాంతంలో ఉంది. సర్వే నెంబరు 118లో 46 ఎకరాల ప్రభుత్వ భూమి మిగతా 2లో..


సాగర్‌నగర్‌లో మొగదారమ్మ గుడి వెనుక భాగంలో అక్రమిత స్థలంలో సాగుతున్న హోటళ్లు, ఇతర నిర్మాణాలు

మొదటి పేజీ తరువాయి..

సగం పనులే..

కాంట్రాక్టర్లు చెబుతున్నారు. పాడేరు ఏజెన్సీలో ఈ సమస్య మరింత ఎక్కువగా వుంది. మైదానం నుంచి నిర్మాణ సామగ్రి తీసుకెళ్లడం వల్ల రవాణా ఖర్చులు ఎక్కువకావడంతో పనులపై కాంట్రాక్టర్లు ఆసక్తిచూపడంలేదు. నిర్మాణ ఖర్చులు పెరగడంతో పాత ధరల ప్రకారం పనులు చేయలేమని కొంతకాలం కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు వెనుకడుగువేశారు. ఏజెన్సీలో ఈ సమస్య వల్ల పనుల్లో జాప్యం చోటుచేసుకుంది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో రూ.260.57 కోట్ల వ్యయంతో 728 గ్రామ సచివాలయ భవనాలు పూర్తికావాల్సి ఉండగా ఇప్పటికి 402 భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మరో 326 భవనాల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ పనులకు రూ.143.41 కోట్లు ఖర్చయింది. రైతు భరోసా కేంద్రాలకు సంబంధించి రూ.152.91 కోట్ల వ్యయంతో 701 భవనాలు పూర్తిచేయాల్సివుండగా, ఇంతవరకూ రూ.66.85 కోట్లు ఖర్చుచేసి 241 పనులు పూర్తిచేశారు. మరో 456 పనులు వివిధ స్థాయిల్లో వున్నాయి. అసలింతవరకు నాలుగు భవనాల పనులను ప్రారంభించలేదు. రూ.95.02 కోట్ల వ్యయంతో 543 వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణాలు పూర్తిచేయాల్సివుండగా రూ.41.53 కోట్లు ఖర్చుచేసి 126 భవన నిర్మాణ పనులు పూర్తిచేశారు. 414 పనులు ప్రగతిలో వున్నాయి. వివిధ కారణాలతో 43 వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణ పనులు ప్రారంభించలేదు. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెంలో బిల్లులు అవ్వక సచివాలయ భవనం పనులను అసంపూర్తిగా కాంట్రాక్టర్ నిలిపేశాడు. మాకవరపాలెం మండలం గిడుతూరులో రెండేళ్ల క్రితం ప్రారంభించిన రైతు భరోసా కేంద్రం పనులు ధరలు పెరగడంతో మధ్యలో ఆపేశారు. అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేటలో రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయ పనులు పూర్తికాలేదు.

అధికారులు ఏం చెబుతున్నారంటే..

ఇంతవరకూ నెలకొన్న నిర్మాణ జాప్యాన్ని తొలగించేందుకు పంచాయతీరాజ్ శాఖకు ప్రభుత్వం లక్ష్యం విధించింది. దీంతో సెప్టెంబరు నాటికి ప్రస్తుత విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని సచివాలయ, రైతు భరోసా, వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాల భవనాలు పూర్తిచేయనున్నామని పంచాయతీరాజ్ శాఖాధికారులు చెబుతున్నారు. ఇప్పుడు బిల్లుల సమస్య లేకపోవడంతో నిర్మాణాలు వేగవంతమవుతున్నాయని అంటున్నారు. బిల్లు పెట్టిన వారానికి కాంట్రాక్టర్లకు డబ్బులు జమకావడంతో నిర్దేశిత కాలంలో భవన నిర్మాణ పనులు పూర్తిచేయిస్తామని చెబుతున్నారు. పాడేరు డివిజన్‌లో భవన నిర్మాణాలను డిసెంబరు నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

కబ్జాల చిట్టా చేతిలో ఉన్నా నేలచూపులా..

దురాక్రమణకు గురైంది. సర్వే నెంబరు 29/1, 29/2లో సుమారుగా ఆరు ఎకరాలు కబ్జాకు గురైంది. దురాక్రమణదారుడు రుషికొండలో పెత్తందారుకావడం, వైసిపి తీర్థం పుచ్చుకోవడంతో రెవెన్యూ, స్థానిక ఎంఎల్ఎ సదరు వ్యక్తిని కాపాడుతున్నారన్న చర్చ రుషికొండ ప్రాంతంలో జోరుగా సాగుతోంది. రాజధాని ప్రాంతమైన విశాఖ సాగర తీరంలో పాదం మోపేటంత భూమిని కూడా కబ్జా కానివ్వమంటూ వైసిపి పెద్దలంతా చెబుతున్నా వాస్తవం దానికి భిన్నంగా ఉంది. జివిఎంసి, రెవెన్యూ యంత్రాంగం వద్ద కబ్జాల లెక్కలు, వివరాలన్నీ ఆధారాలతో సహా ఉన్నా చర్యలు తీసుకోవడంలో వెనుకాడుతున్నాయి.



రుషికొండలో చెన్నాదాసు ఆక్రమణలో ఉన్న స్థలం

రక్షణ ఏర్పాట్లు ఏవీ ?

చెరువులు, గెడ్డలు, శ్మశానాలు, వాగు పోరంబోకు, కొండ పోరంబోకు భూమికి రక్షణ ఏర్పాట్లు చేయాలని హైకోర్టు సూచించింది. 57/2 సర్వే నెంబరులో 6 ఎకరాల్లో ఓ కుటుంబం వ్యవసాయం చేసుకుంటున్నామంటూ పాస్ పుస్తకం కోసం దరఖాస్తు చేసుకుంది. రూ.వందల కోట్ల విలువైన భూమి ఇది. చర్యలు తీసుకోవడంలో జరుగుతున్న తాత్సారం ఫలితంగా కబ్జాకోర్లు దర్జాగా పబ్బం గడుపుకుంటూ భూముల కోసం దరఖాస్తులు చేసుకోవడం తాజా పరిణామం. రాష్ట్ర ప్రభుత్వం కూడా త్వరలో డి పట్టాలు, ఆక్రమిత భూములకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేయనుందని, జీవో వస్తుందని వీరంతా ప్రచారం చేసుకోవడం విశేషం.

సిఎం జగన్‌కు ఘన స్వాగతం, వీడ్కోలు

సిఎం విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు అందరూ ఆత్మీయ వీడ్కోలు పలికారు. నెడ్ క్యాప్ ఛైర్మన్ కెకె.రాజు, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, కన్నబాబు రాజు, వాసుపల్లి గణేష్ కుమార్, అదీప్‌రాజు, ఉమా శంకర్ గణేష్, తదితరులు వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ముఖ్యమంత్రి 2.45 గంటలకు ప్రత్యేక విమానంలో విజయవాడకు తిరుగు పయనమయ్యారు. ముఖ్యమంత్రి వెంట టిటిడి మాజీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, సిఎంఒ జాయింట్ సెక్రటరీ భరత్ గుప్తా, సిఎం పిఎ కె.నాగేశ్వరరెడ్డి ఉన్నారు.

అల్లు అర్జున్‌ను కలిసిన దిలీప్ బైరా

ప్రజాశక్తి - విశాఖపట్నం : జాతీయ ఉత్తమ నటుని అవార్డు దక్కించుకున్న తొలి తెలుగు నటునిగా చరిత్ర సృష్టించిన అల్లు అర్జున్‌ను బైరా ఫౌండేషన్ తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు దిలీప్ సి బైరా హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. అల్లు అర్జున్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా ఉన్నారు.



అల్లు అర్జున్‌కు అభినందనలు తెలుపుతున్న దిలీప్ బైరా

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త సుమా..

కంచరపాలెం యువకుని ఆత్మహత్య కేసులో ఇద్దరు అరెస్ట్

పార్ట్ టైం జాబ్ పేరుతో రూ.29.5 లక్షలు కాజేసిన నిందితులు

ఆన్‌లైన్ మోసాల వివరాలు వెల్లడించిన సిపి త్రివిక్రమ వర్మ



మాట్లాడుతున్న సిపి త్రివిక్రమ వర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగర ప్రజలు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇటీవల కాలంలో కొందరు చిన్నచిన్న మొత్తాల కోసం ఇన్‌స్టంట్ లోన్ యాప్‌లపై ఆధారపడుతూ.. అనంతరం జరిగే పరిణామాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని నగర పోలీస్ కమిషనర్ సిఎం.త్రివిక్రమ వర్మ తెలిపారు. శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో ఎటువంటి హామీ లేకుండా తక్కువ మొత్తంలో సులువుగా లోన్లు ఇస్తూ అధిక వసూళ్లకు పాల్పడుతున్న ముఠాలు ఎక్కువయ్యాయన్నారు. సోషల్ మీడియాలో ప్రకటనలు ఇస్తూ వాటిపై క్లిక్ చేసిన వెంటనే బాధితుల పూర్తి వివరాలు చేజిక్కించుకుని అనంతరం మానసికంగా వేధిస్తుంటాయని తెలిపారు.

కంచరపాలెం ఘటన ఓ ఉదాహరణ

'నగరంలోని కంచరపాలెం ప్రాంతానికి చెందిన గున్న హేమంత్ ఓ యాప్ ద్వారా చిన్న మొత్తాల్లో లోన్లు తీసుకొని కొంత మొత్తం తిరిగి చెల్లించాడు. అయినప్పటికీ ఇంకా ఎక్కువ మొత్తంలో డబ్బు కట్టాలని, కట్టిన డబ్బులు ఇంకా తమకు అందలేదని వివిధ రూపాల్లో అతన్ని సదరు యాప్ నిర్వాహకులు వేధించారు. అతని ఫొటోలను మార్ఫింగ్ చేసి అందరికీ పంపించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు' అని సిపి తెలిపారు. ఈ కేసులో అతని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని, అనంతపురానికి చెందిన చీమల సుబ్బరామిరెడ్డిని, ఒడిశాకు చెందిన దిలీప్ కుమార్ పాత్రోను అరెస్టు చేశామని వెల్లడించారు. ఈ కేసులో అసలు నిందితులు మలేషియా నుంచి పనిచేస్తున్నారని తెలిపారు. వారిని అరెస్ట్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని అన్నారు. ఈ సైబర్ నేరగాళ్లు 2022లో రూ.2 కోట్లు, 2023లో రూ.9 కోట్లకు పైగా దోచుకున్నారని. తెలిపారు

ఉద్యోగాల పేరిట..

నగరానికి చెందిన ఇద్దరు పార్ట్ టైం జాబ్స్ పేరిట ఒకరు రూ.22 లక్షలు, మరొకరు రూ.7.5 లక్షలు నష్టపోయారని సిపి తెలిపారు. వారిని ఆన్‌లైన్‌లో ఎదుటవారు ఎలా మోసం చేశారో వివరించారు. ఈ క్రమంలో సైబర్ క్రైమ్ ఫిర్యాదుకు నగర వాసులు www.cyber-crime.gov.in లేదా 1903 నెంబర్లను సంప్రదించాలని సిపి కోరారు.

అగనంపూడి టోల్‌గేట్ తొలగించాలని..

ఎంపీకి సిపిఎం కార్పొరేటర్ వినతి



ఎంపీ ఎంవివికి వినతిపత్రం అందజేస్తున్న గంగారావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అగనంపూడి టోల్‌గేట్‌ను వెంటనే తొలగించాలంటూ విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణకు సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు శుక్రవారం ఉదయం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడువు అయిపోయినా టోల్‌గేట్‌ను తొలగించకుండా ప్రజలను, వాహనదారులను నిలువ దోపిడీ చేయడం దారుణమన్నారు. ఆనందపురం - సబ్బవరం - అనకాపల్లి అరు లైన్ల రోడ్డు నిర్మాణం పూర్తయిన వెంటనే అగనంపూడి టోల్‌గేట్ తొలగిస్తామని సుప్రీం కోర్టులో నేషనల్ హైవే సంస్థ హామీ ఇచ్చి దాన్ని ఉల్లంఘించిందని గంగారావు ఎంపీ ఎంవివికి తెలియజేశారు. జివిఎంసి పరిధిలో టోల్‌గేట్ ఉండకూడదని అన్నారు. ఈ విషయమై జివిఎంసి కౌన్సిల్‌లో కూడా టోల్‌గేట్ తొలగించాలని గత ఏడాది ఏకగ్రీవ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఎంపీని కలిసిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఉన్నారు.

కలెక్టర్‌కు సిపిఐ విజ్ఞప్తి

కలెక్టరేట్ : టోల్‌గేట్‌ను తక్షణమే తొలగించాలని జిల్లా కలెక్టర్ మల్లికార్జునకు, జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మకు సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు మెయిల్ ద్వారా వినతిపత్రాలు పంపించారు.

తర్లువాడ కొండను కాపాడుకుందాం

మౌన దీక్ష ఆరంభం



కొండపై ఆందోళన చేస్తున్న స్వామీజీలు, స్థానికులు

ప్రజాశక్తి -ఆనందపురం: చారిత్రక నేపథ్యమున్న తర్లువాడ కొండను సమిష్టిగా కాపాడుకుందామని ఎపి సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానంద స్వామీజీ, కరుణానంద స్వామీజీ , సభ్యులు రామానంద, వేణుగోపాల్, త్రినాథ్, రామచంద్రమూర్తి, విరాట్ హిందూ సంఘ అధ్యక్షులు ఫణీంద్ర కోరారు. శుక్రవారం స్థానికులతో కలిసి తర్లువాడ కొండ వద్ద మౌన దీక్ష చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసానంద స్వామీజీ మాట్లాడుతూ వైసిపి పాలనలో భూఆక్రమాలు ఎక్కువైపోయాయన్నారు. ముఖ్యంగా హిందూ దేవాలయాల విధ్వంసం, అసాంఘిక కార్యక్రమాలు పెచ్చురిల్లిపోయాయన్నారు. వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి తన కుమార్తె నేహారెడ్డి విద్యాసంస్థల పేరుతో తర్లువాడ కొండను కాజేయాలని చూస్తే హిందువులంతా ఐక్యమై ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. మౌనదీక్షలో స్థానికులు, మహిళలు పాల్గొన్నారు.

అపోలోలో అరుదైన శస్త్రచికిత్స



కాలి మడమకు ఆపరేషన్

ప్రజాశక్తి - ఆరిలోవ : అపోలో ఆసుపత్రిలో ప్రొఫెసర్ అండ్ హెచ్ఒడి డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ అరుదైన, సున్నితమైన ఆర్థోపెడిక్ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. 54 ఏళ్ల వ్యక్తి రెండేళ్లుగా మడమ వద్ద వాపు, నొప్పితో బాధపడుతూ, విశ్రాంతి తీసుకోవడంతోపాటు అనాల్జెసిక్స్, బ్రేస్, ఫిజియో థెరపీ, స్టెరాయిడ్స్ ఇంజక్షన్లను వాడినా ఎటువంటి ఉపశమనం కలగకపోవడంతో అపోలో ఆసుపత్రిలో డాక్టర్ డి ఖాన్‌ను సంప్రదించారు. రోగికి ఎంఆర్ఐ స్కాన్ తీయగా, అతనికి మడమ హాగండ్స్ వైకల్యం గుర్తించారు. అనంతరం రోగికి థెరప్యూటిక్ హిండ్ ఫుట్ ఎండోస్కోపీ అండ్ కాల్కానియోప్లాస్టీ చేసారు. 24 గంటల వ్యవధిలోనే రోగి కోలుకోవడంతో డిశ్చార్జ్ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో వెనక పాదంలో ఇలాంటి ఆపరేషన్ జరగడం ఇదే తొలిసారని డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ తెలిపారు.

స్థానికులకు 75 శాతం ఉద్యోగాలివ్వాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రభుత్వరంగ సంస్థలలో ఉద్యోగ కల్పనలో స్థానిక నిరుద్యోగ యువతకు 75శాతంరిజర్వేషన్ కల్పించాలని ఎపి నిరుద్యోగ జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ కోరారు. ఉన్నత పాఠశాలలలో కాంపోజిట్, సంస్కృతం సబ్జెక్టును కొనసాగించాలని విన్నవించారు. శుక్రవారం కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవిద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు వాట్సప్ ద్వారా వినతిపత్రాన్ని పంపించారు. ఆర్టికల్ 371డి ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలోఉద్యోగ కల్పనలో స్థానికులకు 75శాతం రిజర్వేషన్ కల్పించాల్సి ఉందన్నారు. పెరుగుతున్న నిరుద్యోగిత దృష్ట్యా, స్థానికంగా ఉద్యోగాలు కల్పించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకుని, నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. విఆర్‌కె శర్మ, టి మధుసూదనరావు మాజీ ఎయిర్ ఫోర్స్ అధికారి మహీధర నాగేశ్వరరావు. పాల్గొన్నారు.

కుండపోత వర్షం

ప్రజాశక్తి -తగరపువలస : తగరపువలస పరిసర ప్రాంతాల్లో శుక్ర వారం సాయంత్రం భోరున వర్షం కురిసింది. దీంతో కాలువలు, పల్లపు ప్రాంతాల్లో భారీగా వర్షపు నీరు చేరి, చెరువులను తలపించాయి. సబ్బివారి వీధి, విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రోడ్డుపై మోకాలిలోతు వర్షపు ప్రవహించడంతో ప్రజలు, వాహనదారులుతీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నీట్ ర్యాంకర్లకు 'గీతం' బంపర్ ఆఫర్

ఎంబిబిఎస్‌లో ప్రవేశానికి ఫీజులో భారీ రాయితీ



మాట్లాడుతున్న జిమ్సర్ ప్రో విసి గీతాంజలి

ప్రజాశక్తి- మధురవాడ: ప్రతిభను ప్రోత్సహించే క్రమంలో ఎంబిబిఎస్‌లో ప్రవేశం పొందేవారికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఫీజులో భారీ రాయితీతో బంపర్ఆఫర్‌ను ప్రకటించింది. శుక్రవారం జిమ్సర్ వైద్య కళాశాల ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో ప్రో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది నీట్ అండర్ గ్రాడ్యుయేట్ 2023 పరీక్షల్లో జాతీయ స్థాయిలో దాదాపు 11.45 లక్షల మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. జిమ్సర్ వైద్య కళాశాల ద్వారా నీట్ ర్యాంకర్లలో లక్షన్నరలోపు ర్యాంక్ సాధించిన వారికి 50 శాతం మేర ఫీజులో రాయితీని స్కాలర్‌షిప్ రూపంలో తగ్గించనున్నట్లు వెల్లడించారు. అలాగే 3 లక్షల లోపు ర్యాంకు సాధించిన వారికి 25 శాతం, నాలుగున్నర లక్షలలోపు ర్యాంకర్లకు 15 శాతం, 6 లక్షల లోపు ర్యాంకు సాధించిన వారికి 10 శాతం ఫీజు రాయితీ ఉంటుందన్నారు. గీతంలో ప్రవేశం పొందాక ఎంబిబిఎస్ వార్షిక పరీక్షలలో 65 శాతం పైన మార్కులు సాధించిన వారికి ఫీజు రాయితీ కొనసాగిస్తామన్నారు. గీతంలో 150 ఎంబిబిఎస్ సీట్లకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసి) అనుమతి ఇచ్చిందని తెలిపారు. గీతంలో ప్రవేశాలు మెడికల్ కౌన్సిలింగ్ కమిటి నిబంధనలకు అనుగుణంగా ఉంటాయని, ప్రవేశం పొంద గోరే నీట్ ర్యాంకర్లు మెడికల్ కౌన్సిలింగ్ కమిటీ పోర్టల్ ద్వారా ముందుగా తమ వివరాలను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. జిమ్సర్ డీన్ డాక్టర్ ఎస్‌పిరావు, జిమ్సర్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి పద్మజ వైద్య విద్యలో అనుసరిస్తున్న ఉన్నత బోధన, పరిశోధన విధానాలను వివరించారు. అలాగే వైద్య విద్యార్థులకు అధునాతన వైద్య పరికరాలతో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

నేత్రదానంపై విస్తృత అవగాహన



పక్షోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - సీతమ్మధార : కంటి సంరక్షణ, నేత్రదానంపై విద్యార్థులు, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించనున్నట్లు జిల్లా అంధత్వ నివారణా సంస్థ ప్రోగ్రాం మేనేజర్, ప్రభుత్వ నేత్రవైద్యశాల సూపరెంటిండెంట్ డాక్టర్ విశ్వామిత్ర అన్నారు. ఈ నెల 25న శుక్రవారం నుంచి వచ్చేనెల 8వరకు నిర్వహించనున్న నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా తన చాంబర్‌లో ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కెజిహెచ్ సూపరెంటిండెంట్ డాక్టర్ పి అశోక్‌కుమార్, డిఎంహెచ్ఒ డాక్టర్ పి జగదీశ్వరరావుతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పక్షోత్సవాల్లో భాగంగా రూరల్, అర్బన్ ప్రాంతాల్లో పిహెచ్‌సిలు, విద్యాలయాలు, బస్, రైల్వేస్టేషన్లు, ఇతర పబ్లిక్ ప్రదేశాల్లో నేత్రదానంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. నర్సింగ్, ఇతర పాఠశాలల విద్యార్థులకు నేత్రదానంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, సర్టిఫికెట్, బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ప్రెసిడెంట్ పి.శ్యామ్ విక్టర్, రాజగోపాలరెడ్డి, ప్రాంతీయ నేత్ర వైద్యశాల వైద్యులు, ఐ బ్యాంక్, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ సింహాచలం

ప్రజాశక్తి -గాజువాక :సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జివిఎంసి గాజువాక జోనల్ కమిషనర్ పొందూరు.సింహాచలం అన్నారు. శుక్రవారం 76వ వార్డు చిన్న కోరాడజంక్షన్ వద్ద ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌సి మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నీటినిల్వలో దోమలు విజృంభించే ప్రమాదం ఉన్నందున పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంటా, పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. జ్వరాలు వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరీక్షించుకుని, వైద్యసేవలు పొందాలన్నారు. అందరి సమన్వయంతో దోమలను అరికట్టడం ద్వారా వ్యాధులు ప్రబలకుండా చూడాలని పిలుపునిచ్చారు.అనంతరం నేలబావులలో గంబూషియా చేపలను వదిలారు. కార్యక్రమంలో ప్రజారోగ్య శాఖ సహాయ వైద్యాధికారి కిరణ్‌కుమార్, మలేరియా ఇన్‌స్పెక్టర్ దొడ్డి శ్రీనివాసరావు, సిఐఒ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఐదో వార్డులో వీధిదీపాలు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఐదో వార్డు పరిధిలోని పలు కాలనీల్లో నూతనంగా వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు కార్పొరేటర్ మొల్లి హేమలత తెలిపారు. జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో సమస్యను లేవనెత్తగా, అధికారులు, పాలకమండలి స్పందించి. వార్డులోని వైఎస్ఆర్ కాలనీ, నగరంపాలెం, అంబేద్కర్ కాలనీ, బొట్లవానిపాలెం, పరదేశిపాలెం ప్రాంతాల్లో కొత్తగా విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారన్నారు. మిగిలిన ప్రాంతాల్లోనూ వీధి దీపాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.

నూతన వార్డు అధ్యక్షునికి అభినందనలు



గోపిని అభినందిస్తున్న వార్డు ప్రజలు

ప్రజాశక్తి- గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు వైసిపి నూతన అధ్యక్షునిగా నియమితు లైన అయితంశెట్టి రేణుక గోపాలకృష్ణ (గోపి)ని ఆ వార్డు జెసిఎస్ క్లస్టర్ ఇన్‌ఛార్జి గేదెల మురళీకృష్ణ, ఖార్వేల్ నగర్ గ్రామ ప్రజలు, కన్వీనర్ తులసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ వార్డు సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనకు అభినందనలు తెలిపిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

కేరళ యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేరళకు చెందిన యువతి రమేష్ కృష్ణ (25) నగరంలోని ఒక లాడ్జిలో ఆత్మహత్యకు పాల్పడింది. టూ టౌన్ సిఐ బి.తిరుమలరావు శుక్రవారం మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. కేరళ రాష్ట్రం తిరుచూరు జిల్లా వందపల్లి గ్రామానికి చెందిన రమేష్ కృష్ణ విశాఖలోని డాబా గార్డెన్స్ భాను వీధిలో ఉన్న వాస్తు ఇన్ లాడ్జిలో బుధవారం దిగింది. గురువారం ఆమె గదిని ఖాళీ చేయాల్సి ఉంది. ఆమె పేర్కొన్న గడువు ప్రకారం గదిని ఖాళీ చేయకపోవడంతో లాడ్జి సిబ్బంది ఆమె ఉంటున్న గది డోర్ బెల్ నొక్కారు. తలుపులు ఎంతకీ తెరవకపోవడంతో లాడ్జి మేనేజర్ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వచ్చి తలుపులు తెరవగా అప్పటికే రమేష్ కృష్ణ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. గదిలో ఉన్న ఒక సూట్ కేసు, రెండు బ్యాగ్స్‌ను, అక్కడే ఉన్న సూసైడ్ లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తన ఆత్మహత్యకు ఎవరూ కారకులు కాదని లేఖలో ఆమె పేర్కొన్నట్లు సిఐ తెలిపారు. బ్యాగులో లభించిన ఆధార్ కార్డు, ఇతర వివరాల ఆధారంగా కేరళలోని ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామన్నారు. రమేష్ కృష్ణ ఈ నెల 18న కూడా ఇదే లాడ్జిలో ఒక రూమ్ తీసుకుని, ఆ తరువాత రోజు వెళ్లిపోయారని లాడ్జి మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. చైనాలో రమేష్ కృష్ణ వైద్య విద్య అభ్యసించేందుకు వెళ్లే క్రమంలో విశాఖ వచ్చినట్లు సమాచారం.

ఆన్‌లైన్ రమ్మీ ఆడుతున్న ముగ్గురిపై కేసు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధి సిమ్మన్నగారి పూరు శివారు వద్ద ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడుతున్న ముగ్గురిపై పరవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన మైలపల్లి బంగార్రాజు, మైలపల్లి పోలరాజు, తంతడి గ్రామానికి చెందిన చోడిపల్లి పైడిరాజులను రమ్మీ ఆడుతుండగా పరవాడ సిఐ పి.ఈశ్వర్రావు, సిబ్బంది పట్టుకున్నారు. వారి నుండి ఆన్‌లైన్ రమ్మీ ఆడటానికి ఉపయోగించిన 8 ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై ఎపి గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు సిఐ ఈశ్వర్రావు తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- సకాలంలో స్పందించి, కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి భీమునిపట్నం : స్థానిక ప్రైవేట్ హోటల్ ఎదురుగా ఉన్న సముద్రంలో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తిని స్థానిక పోలీసులు కాపాడిన ఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది.

పోలీసుల కథనం ప్రకారం..పెందుర్తి, చిన ముషిడివాడకు చెందిన పొట్నూరు రవితేజ (34) ఆన్‌లైన్‌లో రమ్మీ ఆటలకు బానిసయ్యాడు. ఇందుకోసం పలు బ్యాంకుల నుంచి రూ.15 లక్షల వరకు రుణం వాడాడు. తీసుకున్న రుణం తీర్చాలని బ్యాంకర్ల నుంచి ఒత్తిడి పెరిగడంతో, తీర్చే స్తోమత లేకపోవడంతో ఆత్మహత్యకు యత్నించారు.స్విగ్గీడెలివరీకి వెళ్తున్నట్లు గురువారం సాయంత్రం 7 గంటలకు ఇంటి వద్ద చెప్పి, భీమిలి బీచ్‌కు రాత్రి 10.30 గంటలకు వచ్చాడు. మోటారు బైక్‌ను ప్రైవేట్ హోటల్ వద్ద పార్కింగ్ చేశాడు. తాను అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తన బావకు ఫోనులో సమాచారమిచ్చాడు. వెంటనే రవితేజ బావ డయల్ 100కు ఫోను చేసి విషయం చెప్పడంతో అప్రమత్తమైన ఎస్ఐ జి.హరీష్ ఆధ్వర్యంలో పోలీసులు బీచ్‌కు చేరుకుని రవితేజను కాపాడారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆత్మహత్యాయత్నం చట్టరీత్యానేరమని వివరించారు. పోలీసుల స్పందనపై రవితేజ కుటుంబసభ్యులు హర్షం వెలిబుచ్చి, ప్రశంసించారు.

అండర్ పాత్‌వే పనులు పూర్తి చేయండి

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు చంద్రనగర్ అండర్ పాత్‌వే నిర్మాణం పనులను వేగవంతంగా పూర్తి చేయాలని బిజెపి ఎపి ప్రోటోకాల్ కన్వీనర్ బాల రాజేశ్వరరావు కోరారు. శుక్రవారం డిఆర్ఎం సౌరబ్ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. 2015లో డిఆర్ఎం అనూప్‌కుమార్ శతపతి కేంద్ర నిధులతో పనులు చేపట్టారని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. దీనిపై డిఆర్ఎం స్పందిస్తూ, సింహాచలం రైల్వేస్టేషన్, అదనపు ప్లాట్‌ఫాం, రైల్వేట్రాక్‌లను పెంచి అభివృద్ధి పనులు చేపట్టనున్నందున కొంత సమయం పడుతుందన్నారు. అండర్ పాత్‌వేకు సిమెంట్ బాక్సులు తయారు చేసినా మరిన్ని చేయాల్సి ఉందని, జనవరిలోగా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆర్‌పి.రాజు లేని లోటు తీర్చలేనిది

- ప్రథమ వర్థంతి సభలో వక్తలు



రాజు వర్థంతి సభలో సిపిఎం, ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి- సీతమ్మధార : సిపిఎం కార్యక్రమాలు, ఉద్యమాల్లో ముందుండే ఆర్‌పి రాజు లేనిలోటు తీర్చలేనిదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు అన్నారు. రాజు కుటుంబానికి ఎల్లప్పుడూ సిపిఎం అండగా ఉంటుందన్నారు. శుక్రవారం సిపిఎం అక్కయ్యపాలెం జోన్ నాయకులు ఆర్‌పి.రాజు ప్రథమ వర్థంతి సభ 45వ వార్డు ఎఎస్‌ఆర్ నగర్ కాలనీలో నిర్వహించారు. ముందుగారాజు చిత్రపటానికి గంగారావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎమ్‌కు, ప్రజలకు రాజు చేసిన సేవలను కొనియాడారు. ఎఎస్‌ఆర్ నగర్ కాలనీ అభివృద్ధికి, పేదలకు ఇళ్ల పట్టాలకు సుదీర్ఘ పోరాటం చేశాడన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి సుబ్బన్న మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి, వారి సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాల్లో రాజు పాల్గొని, విజయంలో కీలకపాత్ర పోషించారన్నారు.సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కుమార్, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, అక్కయ్యపాలెం జోన్ నేత మాధవి, గౌరి, జోన్ ఇన్‌ఛార్జి రాజు, స్వతంత్ర కుమార్ పాల్గొన్నారు.

31న భెల్ గుర్తింపు సంఘం ఎన్నికలు



నామినేషన్ దాఖలు చేస్తున్న ప్రకాష్, బాబురావు

ప్రజాశక్తి -గాజువాక : ఈనెల 31న జరగనున్న భెల్ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల సంబంధించి ప్రోగ్రెసివ్ ఫ్రంట్ తరపున పోటీ చేస్తున్న ప్యానెల్ అభ్యర్థులు శుక్రవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నికల అధికారి, రీజనల్ లేబర్ కమిషనర్ జగన్నాథ్ మహంతికి బిహెచ్‌పివి నేషనల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్‌టియుసి అనుబంధం), ప్రోగ్రెసివ్ ఫ్రంట్ తరపున అధ్యక్షులుగా జిటివి. ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా వి బాబురావుతో పాటు ప్యానెల్ సభ్యులు ఎన్ నవీన్ కుమార్, వై కృష్ణారావు, వి ఆనందరావు, పి ఆనంద్‌కుమార్, ఎస్ జగన్నాథరావు, ఆర్.అప్పారావు, పి కనకారావు, ఎస్ రామారావు, సీత నాయుడు నామినేషన్లు వేశారు.

హీరో గ్లామర్ న్యూ వెర్షన్ ఆవిష్కరణ



హీరోగ్లామర్ బైక్‌ను ఆవిష్కరిస్తున్న రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార/ ఎంవిపి కాలనీ : అనేక విభిన్న వాహనాలను వినియోగదారులకు అందించడం ద్వారా ప్రజల్లో బ్రాండ్ ఇమేజ్ సంపాదించుకుని దూసుకుపోతున్న హీరో మోటార్‌సంస్థ, తాజాగా గ్లామర్ బైక్ కొత్త వెర్షన్ వెహికల్‌ను అందించడం సంతోషకరమని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు అన్నారు రేసపువానిపాలెంలో ప్రముఖ ద్విచక్ర వాహన కంపెనీ హీరో గ్లామర్ కొత్త వెర్షన్‌ను, కంపెనీ డీలర్ శ్రీ హర్ష మోటార్స్ షోరూంలో ఆవిష్కరించారు.. హీరోకంపెనీ ప్రతినిధులు విజయకన్నన్, దీపక్, సీతారామరాజు, కె. సురేష్, వి. రమేష్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ హీరో సంస్థ ఇప్పటికే ఆకర్షనీయమైన బైక్‌లను అందించడం ద్వారా వినియోగదారుల ఆదరణ చూరగొని, వారికి చేరువైందన్నారు. కార్యక్రమంలో. వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, శ్రీ హర్ష మోటార్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాసిత కార్మికుల సమస్యలను పరిష్కరించండి

మంత్రి అమర్‌నాథ్‌కు అఖిలపక్ష పార్టీలు, కార్మిక సంఘాల వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నేతలు

ప్రజాశక్తి -గాజువాక : అదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అఖిలపక్ష పార్టీలు, కార్మిక సంఘాల నేతలు, పోర్టు కార్మికుల బృందం కోరింది శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సమక్షంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, నిర్వాసిత కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇప్పటికే కృషి చేస్తున్నామన్నారు. ఆదానీ యాజమాన్యం గతంలో అంగీకరించిన అంశాలను వివరించారు. శనివారం సర్క్యూట్ హౌస్‌లో కలెక్టర్ సమక్షంలో యాజమాన్య ప్రతినిధులు అఖిలపక్ష పార్టీలు, కార్మిక సంఘాల ప్రతినిధులు, పోర్టు కార్మికులతో జాయింట్ సమావేశం నిర్వహించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, టిడిపి నేత ప్రసాదుల శ్రీనివాసరావు, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, పులి రమణారెడ్డి సిపిఎం నేత కెఎం శ్రీనివాసరావు, సిపిఐ నేత కసిరెడ్డి సత్యనారాయణ, కాంగ్రెస్ నేత ముత్యాలనాయుడు, ఎఐటియుసి నేత డి ఆదినారాయణ, ఇంటక్ నేత మంత్రి రాజశేఖర్, సిఐటియు నేతలు బి జగన్, కొవిరి అప్పలరాజు, ఇతర నేతలు కొవిరి అవతారం, చీకటి అప్పారావు, ఉమ్మడి అప్పారావు, గంగవరం పోర్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి లొల్లి తాతారావు, గంటి పిల్ల అమ్మోరు, మాదా అప్పారావు, కదిరి సత్యానందం, పేర్ల నూకరాజు, నొల్లి స్వామి, గంటిపిల్లి లక్ష్మయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన



పంటపొలాలను పరిశీలిస్తున్న నాబార్డు, అంతర్రాష్ట్ర బృందం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని తర్లువాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న క్షేత్రాలను నాబార్డ్ డిజిఎం, ఎజిఎం, ఇంకా నేపాల్, దేశంలోని 17 రాష్ట్రాల ప్రతినిధుల జిఎజెడ్ బృందం శుక్రవారం సందర్శించింది. ఈ బృందానికి జిల్లా కమ్యూనిటీ నేచురల్ ప్రాజెక్ట్ మేనేజర్ మోహనరావు స్వాగతించి, జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న తీరును వివరించారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా, సేంద్రీయ పద్ధతుల్లో చేపట్టే ప్రకృతి వ్యవసాయ విధానంలో ఆరోగ్యకరమైన పంటలను సాగుచేస్తున్నతీరును బృందానికి వివరించారు. ఈ విధానంలో సాగుద్వారా భూసారం పరిరక్షించ బడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ప్రోత్సాహిస్తూ, పలు రాయితీలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ అధికారి ప్రకాష్, ఆనందపురం మండల వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, తర్లువాడ సర్పంచ్ బిఆర్‌బి నాయుడు, వంటాకుల రామారావు పాల్గొన్నారు

27 నుంచి విద్యార్థులకు క్రీడాపోటీలు

ప్రజాశక్తి -గాజువాక : ఈ నెల 27, 28, 29 తేదీల్లో గాజువాక పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు యార్లగడ్డ వెంకన్న చౌదరి తెలిపారు. శుక్రవారం ఆటోనగర్‌లో క్రీడాపోటీల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆటోనగర్ రోటరీ క్లబ్, విశాఖపట్నం సౌత్ రోటరీ క్లబ్, గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి, బహుమతులు గెలుచుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ ఉమా మహేశ్వరరెడ్డి, సభ్యులు నితీష్, నిర్మల్ దుగార్, గౌతమ్, కల్చరర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ అప్పారావుపాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వెంకన్నచౌదరి

బిసిల అభ్యున్నతికి టిడిపి విశేష కృషి

బిపి.మండల్‌కు ఘననివాళి



బిపి.మండల్‌కు నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -గాజువాక : బలహీన వర్గాల అభ్యున్నతికి బిపి.మండల్ విశేషంగా కృషి చేశారని తెలుగుదేశం పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పాత గాజువాక టిడిపి కార్యాలయంలో బిసి పితామహుడు బిపి మండల్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలను వేసి ఘన నివాళులను అర్పించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో బిసిలకు సముచిత స్థానం కల్పించి ఎన్‌టిఆర్‌న న్యాయం చేస్తే, తర్వాత చంద్రబాబు బిసిల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారన్నారు.బిసి ప్రభుత్వమని చెప్పుకునే వైసిపి, వారి రిజర్వేషన్‌ను 34 నుంచి 24శాతానికి కుదించడంతోపాటు ఆదరణ వంటి అనేక పథకాలను రద్దు చేసిందన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో బిసిలపై లేనిపోని కేసులు పెట్టి కక్షసాధింపు చర్యలకు జగన్‌రెడ్డి ప్రభుత్వం పాల్పడిందన్నారు. కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గం టిడిపి సమన్వయ కర్త ప్రసాదుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పోతిన వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గోమాడ వాసు, 75వ వార్డు అధ్యక్షుడు నమ్మి అప్పారావు, టిఎన్‌టియుసి నేత అప్పలనాయుడు, గవర సాధికార కమిటీ సభ్యులు విల్లూరి శివప్రసాద్, వియ్యపు నరేష్ పాల్గొన్నారు.

వైసిపి తూర్పు సమన్వయకర్తగా ఎంవివి



ఎంవివి.సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆరిలోవ: విశాఖ తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్తగా విశాఖ ఎంపి ఎంవివి. సత్యనారా యణను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ మేరకు నియామకం చేపట్టినట్లు పార్టీ కార్యాలయం వెల్లడించింది.

నేత్రదానానికి ముందుకు రావాలి



డాక్టర్ రోహిత్ దురేజా

ప్రజాశక్తి - ఆరిలోవ : నేత్రదానానికి ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి, కార్నియల్ అంధత్వ నివారణకు సహకరించాలని మోహ్సిన్ నేత్రనిధి అధినేత డాక్టర్ రోహిత్ దురేజా పిలుపునిచ్చారు. మరణానంతరం లోకాన్ని చూసే భాగ్యం నేత్రదానంతోనే కలుగుతుందన్నారు. 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా శుక్రవారం ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్యశాల జిఎంఆర్ వరలక్ష్మీ ప్రాంగణంలో ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన కల్పించారు. పక్షోత్సవాలను ప్రారంభించిన డాక్టర్ రోహిత్ దురేజా మాట్లాడుతూ, కార్నియల్ అంధత్వానికి కార్నియా మార్పిడి మాత్రమే సరైన చికిత్స అని, దీనికి నేత్ర దానం చేయాల్సిన ఆవశ్యత ఎంతైనా ఉందన్నారు. నేత్రదానంపై ఆపోహలు, భయాలు మానుకోవాలన్నారుఇప్పటి వరకు ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాల, నేత్ర నిధి వ్యవస్థ 1,33,585 మంది దాతల నుంచి కార్నియాలను సేకరించిందన్నారు. వీటిని ఆసుపత్రిలో కార్నియో ఆపరేషన్లకు వినియోగించడమే కాకుండా, అవసరమైతే బయట ఆసుపత్రులకు కార్నియాలను అందిస్తుందన్నారు. మరణాంతరం వారి కుటుంబసభ్యుల సమ్మతితోనే నేత్రదానం స్వీకరించాల్సి ఉంటుందని, అందుకు నేత్రదానానికి ప్రతిజ్ఞ చేసిన వ్యక్తి తమ కుటుంబసభ్యులకు విషయం చెప్పాలన్నారు.

నాలుగో పట్టణ సిఐగా విజయకుమార్



సిఐ విజయకుమార్

ప్రజాశక్తి- సీతమ్మధార: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ లా అండ్ ఆర్డర్ సిఐగా ఎస్ విజయ్‌కుమార్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో కంచరపాలెం సిఐగా విధులు నిర్వహించిన విజయకుమార్‌ను తాజా బదిలీల్లో భాగంగా ఫోర్త్‌టౌన్ సిఐగా నియమించారు. ఈ సందర్భంగా కొత్త సిఐ విజయకుమార్‌ను స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతించి, అభినందనలు తెలిపారు. కాగా ఇక్కడ సిఐ శ్రీనివాసరావును విఆర్‌కు బదిలీ చేశారు.

అక్రమ నిర్మాణం తొలగించండి



జెసి విశ్వనాథన్‌కు ఫిర్యాదు చేస్తున్న బండారు, టిడిపి నేతలు

ప్రజాశక్తి- పెందుర్తి : 97వ వార్డు చిన ముషిడివాడ బిఆర్‌టిఎస్ రోడ్డును ఆనుకుని సర్వే నెంబర్ 124/4, 5 ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారని, తక్షణమే దాన్ని నిలుపుదల చేసి తొలగించాలని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, ఇతర టిడిపి నేతలు కోరారు. ఈమేరక జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌ను కలిసి, సమస్యను విన్నవించడంతోపాటు ఫిర్యాదు చేశారు. టిడిపి ప్రభుత్వం హయాంలో అక్రమ నిర్మాణంగా గుర్తించి దీన్ని నిలుపుదల చేశామని, రూ.కోట్లు విలువచేసే ప్రభుత్వ భూముల్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారని విన్నవించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, తగు చర్యలు చేపట్టాలని కోరారు. జెసిని కలిసిన వారిలో టిడిపి నేతలు సేవాపతి శంకరరావు, దాట్ల మధు, గల్లా వెంకటరమణ ఉన్నారు.

జీతాల బకాయి చెల్లించాలని పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-రాంబిల్లి

పంచాయతీ కార్మికులకు ఇవ్వాల్సిన జీతాల బకాయిలు చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ ఏవోకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు మాట్లాడుతూ మండలంలోని వివిధ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లకు మూడు నెలలు నుండి 20 నెలల వరకు జీతాలు చెల్లించలేదని తెలిపారు. కార్మికులకు ఇస్తున్న అరకొర జీతాలు రూ.6వేలు కూడా నెలల తరబడి ఇవ్వకపోతే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయి కొనుక్కోలేని పరిస్థితిలో ఉన్న కార్మికులకు ఇన్ని నెలలు జీతం చెల్లించకపోతే వారు కుటుంబాలను ఎలా పోషించుకుంటారన్న ఆలోచన చేయవలసిన అవసరం అధికారులకు లేదా? అని నిలదీశారు. ఇన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న వీరిని కనీసం కార్మికులుగా గుర్తించకుండా, బ్యాంకు ఖాతా ద్వారా జీతాలు చెల్లించకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. సేఫ్టీ పరికరాలు, యూనిఫారం ఇవ్వడం లేదన్నారు. గ్రామాలు ఆరోగ్యంగా ఉండాలంటే, పంచాయతీ కార్మికులకు కనీసం పొట్టయినా నింపాలన్నారు. కొన్ని పంచాయితీలలో జనాభాకు తగ్గట్టుగా పంచాయతీ కార్మికుల నియమించకపోవడం వలన, పారిశుధ్య పనులు లోపించి దోమలు విపరీతంగా పెరిగిపోయి, డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పంచాయతీ కార్మికులకు జీతాలు ఇవ్వకపోతే, పంచాయతీ కార్యదర్శులు పని ఎలా చెప్పగలరని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా అధికారి యంత్రాంగం పంచాయతీ కార్మికుల కష్టాన్ని తెలుసుకొని వారి బకాయి జీతాలను వెంటనే చెల్లించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఎన్ కాశిరావు, అప్పారావు, అప్పలరాజు, ఎస్ దానయ్య, కె నాగేశ్వరరావు, బంగారి రమణ, అప్పారావు, కసింకోట చిన్న కొండయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు



ఆర్థిక సాయం అందజేస్తున్న అంబేద్కర్ ట్రస్టు సభ్యులు

బాలుని వైద్యానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చోడవరం

పట్టణంలోని కోటవీధికి చెందిన మెలిపాక తారకేశ్వరరావు కుమారుడు హేమంత్ బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతుండగా, ఆ బాలుడి వైద్యానికి స్థానిక అంబేద్కర్ ట్రస్ట్ సభ్యులు రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందించారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న తారకేశ్వరరావుకు తమ వంతు సాయి మందించామని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నడుపూరి దేవుడు మాస్టారు, ఎర్రంశెట్టి వరప్రసాద్, వేచలపు ప్రకాష్, జంజూరు అప్పారావు, ఖండేలా వెంకట్రావు, సన్యాసిరావు , దుమ్మేశి గిరిబాబు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వైసిపి నేత బుల్లిబాబు

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - కశింకోట : మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద మండల స్థాయి క్రికెట్ పోటీలను వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు శుక్రవారం ప్రారంభించారు. బుల్లిబాబు ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో సుమారు 12 జట్లు పాల్గొంటున్నాయి. మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.5000 అందజేయనున్నట్లు బుల్లిబాబు తెలిపారు. జి.సంతోష్ మోస లక్షణరావు ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు గెలుపొందిన వారికి సెప్టెంబర్ 2న బహుమతులు ప్రదానం చేయనున్నారు.

ఊరటనిచ్చిన వర్షం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : కొద్ది రోజులుగా వర్షాలు లేక వాతావరణం సైతం వేసవి కాలాన్ని తలపిస్తున్న సమయంలో శుక్రవారం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. కొద్ది రోజుల నుండి విపరీతమైన ఎండలు, ఉక్కపోతతో ప్రజలు విలవిల్లాడారు. వర్షాలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో వరి సాగు సైతం సాగలేదు. వాతావరణం వేసవికాలాన్ని తలపించింది. శుక్రవారం ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడి ఉపశమనం పొందారు.

మారిటైమ్ వర్సిటీలో ఓనం వేడుకలు

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని వంగలిలో గల ఇండియన్ మారిటైం విశ్వవిద్యాలయంలో వరలక్ష్మి వ్రతం, ఓనం పర్వదిన వేడుకలను సంప్రదాయం ఉట్టిపడేలా శుక్రవారం విద్యార్థులు, సిబ్బంది నిర్వహించారు. వర్సిటీలో రంగవల్లులతో అలంకరించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. విశ్వవిద్యాలయ డైరెక్టర్ వికె.కేశవదేవ్ ఓనం ప్రాశస్త్యాన్ని వివరించారు. అనంతరం సాంస్కృతిక పోటీల్లో విద్యార్థుల నిర్వహించిన సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలు క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సాంప్రదాయ వంటలతో ఏర్పాటు చేసిన విందు భోజనాలతో కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఒడి ఎస్.జనార్దనన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయిచరణ్, జె.రాజు, అధ్యాపకులు శ్రీపద్మ, ఎమ్.ప్రేమ్ చంద్, జి.అవినాష్, ఎ.కుమార్ పాల్గొన్నారు.



ఓనం ఉత్సవాల్లో పాల్గొన్న మారిటైం వర్సిటీ విద్యార్థులు

ఘనంగా మళ్ల సురేంద్ర పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ బీసీ సాధికారిక సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర పుట్టిన రోజు వేడుకలు అనకాపల్లిలోని పెంటకోట కన్వెన్షన్ హాల్లో కార్యకర్తలు, అభిమానులు మధ్య శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన రాష్ట్ర మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణ, మాజీ పీలా గోవింద సత్యనారాయణ, శాసన సభ్యులు పి.గణబాబు ఆధ్వర్యంలో సురేంద్ర పుట్టినరోజు కేక్ కట్ చేశారు. ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, దువ్వాడ రామారావు, పార్టీ నాయకులు ప్రగడ నాగేశ్వరరావు, పైలా ప్రసాదరావు, సినీ నటులు ప్రసన్న కుమార్ సురేంద్రకి శుభాకాంక్షలు తెలియజేశారు. టిడిపి నాయకులు కాయల మురళీధర్, పచ్చికూర రాము, మాదంశెట్టి నీలబాబు, బొడ్డెడ జోగినాయుడు, పోలవరపు త్రినాథ్, బొద్దపు ప్రసాద్, సబ్బవరపు గణేష్, కొణతాల రత్నకుమారి, దొడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ నారాయణరావు, కొణతాల వెంకట్రావు, పిట్ల రాజు, దాడి జగన్, మేడిశెట్టి నూకరాజు, పోలమరశెట్టి చందు, మళ్ళ సంతోష్, సందిన చిన్నబాబు, నర్సింగ్, ఎంఎస్ఎన్, సునీల్, అకుల నానాజీ, భానుచందర్, పైలా గోపి, దొడ్డి రాము, బొలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మళ్ల సురేంద్రను సత్కరిస్తున్న గంటా, పీలా తదితరులు

గ్రంథాలయం 12వ వార్షికోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి- మునగపాక రూరల్

మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో గల జోగినాయుడు మాస్టారు గ్రంథాలయం 12వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ ఆవరణలో పుస్తక ప్రదర్శనను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. వార్షికోత్సవ వేడుకలలో భాగంగా ఈనెల 26, 27, 28 తేదీలలో విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్‌తో పాటు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ కమిటీ గౌరవ అధ్యక్షులు పెతకంశెట్టి రామ జోగినాయుడు తెలిపారు. 29న వేడుకల ముగింపు కార్యక్రమం, అదేవిధంగా గ్రంథాలయ వ్యవస్థాపకులు కీర్తిశేషులు పెతకంశెట్టి బాబూరావు జయంతి వేడుకలు ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ పెతకంశెట్టి సతీష్ కుమార్ సారథ్యంలో జరుగుతాయని పేర్కొన్నారు. ఆ సందర్భంగా పోటీల్లో విజేతలకు, పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, మళ్ల వరాహ నరసింహరావు, ఉపాధ్యాయులు పిల్ల జగదీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు ప్రదర్శనకు పెట్టిన గ్రంథాలయ నిర్వాహకులు

ఆర్ఎస్ ఛానల్‌కు నీరు విడుదల

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-చోడవరం

బుచ్చయ్యపేట మండలం మంగళాపురం ఆర్ఎస్ ఛానల్‌కు నీటి విడుదలకు అధికారులు చర్యలు ప్రారంభించారు. 'ఆర్ఎస్ ఛానల్‌కు గండి, వృథాగా పోతున్న కోణాం నీరు' శీర్షికతో ఈనెల 21వ తేదీన ప్రజాశక్తి ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం మంగళాపురం వద్ద ఉన్న ఆర్ఎస్ ఛానల్‌ను ఇరిగేషన్ ఈఈ త్రినాధరావు, డిఈ వేణుగోపాల్ పరిశీలించారు. ప్రస్తుతం నీరు అందించేందుకు ప్రత్యామ్నాయంగా సిరిజం ఆనకట్ట నుండి అప్పలరాజుపురం కాలువ ద్వారా వస్తున్న నీటిని మంగళాపురం ఆర్ఎస్ ఛానల్‌కు కొన్ని రోజులకు మళ్లించేందుకు చర్యలు ప్రారంభించారు. దీంతో ఆయకట్టు భూములన్నింటికీ నీరు అందకపోయినా కొంత మేరకైనా పంట పొలాలకు నీరు వస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

15, 16 తేదీల్లో

వాయుసేన వాయిద్యకారుల ఎంపిక

ప్రజాశక్తి- అనకాపల్లి

సెప్టెంబర్ 15, 16 తేదీల్లో సికింద్రాబాద్ బేగంపేటలో భారత వాయుసేనలో ఎయిర్‌మన్ సెలక్షన్ సెంటర్లో అగ్నిపథ్ వాయు-వాయిద్యకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు రిక్రూట్మెంట్ అధికారి కమాండింగ్ ఆఫీసర్ గురుప్రీత్ అత్వాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, లక్షద్వీప్, పాండిచ్చేరి ప్రాంతాల వారు ఇందులో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు శరీర దారుఢ్యం కలిగి, ఫ్లూట్, క్లారినెట్, సాక్సోఫోన్, కీబోర్డు, ఆర్గాన్, పియానో, గిటార్, వయోలిన్, క్లాసికల్ ఇన్స్ట్రుమెంట్ మొదలైన వాటిలో డిప్లమా, డిగ్రీ కలిగి ఉండాలని సూచించారు. 162 సెంటీమీటర్ల పొడవు, పొడవుకు తగిన బరువు, ఛాతి 5 సెంటీమీటర్లు, స్పష్టమైన కనుచూపు ఉండాలని కోరారు. విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలు పైప్రాంతాల్లో ఉన్న కళాశాలలవై ఉండాలన్నారు. అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు https:// agnipath-vayu.cdac.in/AV వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

విద్యార్థులకు పారితోషకాల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి

విశాఖ క్షత్రియ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో అనకాపల్లి విజయా రెసిడెన్సీ హోటల్లో శుక్రవారం పేద విద్యార్థులకు పారితోషికాలు పంపిణీ చేశారు. అనకాపల్లి రాజపుత్ర సమాజ్ (క్షత్రియ సంక్షేమ సమితి) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనకాపల్లి ప్రాంతానికి చెందిన 60 మంది విద్యార్థులకు సుమారు రెండు లక్షల రూపాయలను ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అనకాపల్లి బ్రాంచ్ మేనేజర్ దివాకర్, సహాయ మేనేజర్ సతీష్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సమితి కార్యదర్శి డిఎస్‌పి వర్మ, సంయుక్త కార్యదర్శి చేకూరి కృష్ణంరాజు మాట్లాడుతూ క్షత్రియ విద్యార్థులతో పాటు అన్ని కులాల్లోని పేదలకు పారితోషకాలను అందజేస్తున్నామని తెలిపారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల విద్యాభివృద్ధిని ప్రోత్సహించడానికి ప్రతి ఏడాది సుమారు 20 లక్షల రూపాయల పారితోషకాలను అందిస్తున్నట్లు చెప్పారు. వైద్యం, సామాజిక రంగాల్లో కూడా సేవలందిస్తున్నామన్నారు. అందరిలో విద్య, విజ్ఞానం, చైతన్యం వస్తే దేశం దానంతట అదే అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు పెనుమత్స కృష్ణంరాజు, పివిఎస్.రాజు, గణపతిరాజు రాజా, సాంబమూర్తి రాజు, డీబీవీపీ రాజు, కె.సత్యనారాయణరాజు, చేకూరి సుధాకర్‌రాజు, మారేడిపూడి కృష్ణంరాజు, వర్మ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పారితోషకాలు అందజేస్తున్న దృశ్యం

ఇసుక మాఫియా బరితెగింపు

- అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే తవ్వకాలు
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలో ఇసుక మాఫియా బరితెగించిందని, స్థానిక అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఇసుక అక్రమ తవ్వకాలపై అనేక సార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని కలిగొట్లలోని ప్రభుత్వ, ప్రైవేటు భూముల నుండి యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారని తెలిపారు. శారదా నదిపై నిర్మించిన నూతన వంతెనకు ఆనుకొని ఉన్న, ప్రభుత్వ పాఠశాలకు మధ్యలో ఉన్న మొత్తం ఇసుక దిబ్బను వారం రోజుల నుంచి తరలిస్తున్నారని, ఈ ఇసుక మాఫియాకు అధికార పార్టీకి చెందిన నాయకులు మద్దతుగా నిలుస్తున్నారని విమర్శించారు. వీటిని అరికట్టాల్సిన భూగర్భ, గనులు, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులు మిన్నకుండిపోతున్నారని తెలిపారు. మండలంలోని శారదా నది పరివాహక ప్రాంతాలైన తెనుగుబూడి,


ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్న దృశ్యం

తిమిరాం, తామరబ్బా, వెంకటరాజుపురం గ్రామాల వల్ల ఇసుక అక్రమ దందా సాగుతుందని పేర్కొన్నారు. దీని వల్ల నూతన వంతెన నిర్మాణానికి, నదీ పరివాహక గ్రామాలకు పెను ప్రమాదం తప్పదని హెచ్చరించారు. సామాన్యుడు ఇసుక తరలిస్తే కేసులతో ఇబ్బందులకు గురి చేసే అధికారులు, ఇంత యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా ఆటువైపు కన్నెత్తి చూడకపోవడం శోచనీయమన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను నిలుపుదల చేయాలని వెంకన్న డిమాండ్ చేశారు.

వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా సూరిశెట్టి


సూరిశెట్టికి కృష్ణుడి విగ్రహాన్ని అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి

వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా సీనియర్ నాయకులు సూరిశెట్టి రమణ అప్పారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా రమణ అప్పారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ నేతృత్వంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా రమణ అప్పారావును సత్యదేవ్ హాస్పిటల్ అధినేత డాక్టర్ బొడ్డేడ లక్ష్మీనరసింహారావు, వైసిపి నాయకులు కర్రి మహాలక్ష్మి నాయుడు, బొడ్డేడ కిరణ్, విల్లూరు సంతోష్, జూరెడ్డి పృధ్వీరాజ్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి, శాలువ, పూల దండలతో సత్కరించి శ్రీకృష్ణుడి విగ్రహాన్ని బహూకరించారు.

ఉపాధ్యక్షులుగా కిలపర్తి భాస్కరరావు


భాస్కరరావు

దేవరాపల్లి : వైసిపి అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులుగా దేవరాపల్లి మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులుగా వరదపురెడ్డి సన్యాసినాయుడు (లలితా నాయుడు) నియమితులయ్యారు. తమకు పార్టీ బాధ్యతలు అప్పగించిన సీఎం జగన్మోహన్ రెడ్డికి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడుకు కిలపర్తి భాస్కరరావు, లలితా నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


మాజీ మంత్రి గంటాకు జ్ఞాపిక ఇస్తున్న గొంతుని శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని పల్లపు సోమవరం గ్రామంలో షిర్డీ సాయినాథ్ ఆలయ 10వ వార్షికోత్సవం ఆలయ ధర్మకర్త గొంతుని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, పలువురు ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు సాయినాథ్‌ను దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త శ్రీనివాసరావు అతిథులకు సాలువాలు కప్పి సాయిబాబా చిత్రపటాన్ని జ్ఞాపికగా అందించారు. వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం వేకువజామున నుంచి ఆలయానికి భక్తులు చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో 10వేల మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొంతుని నాగరత్నం, మాజీ ఎమ్‌పిటిసి గొంతుని పైడితల్లి, ఉగ్గిన రమణ మూర్తి, సిదిరెడ్డి శ్రీను, వేగి గోపికృష్ణ, పెంటకోట రాము, కర్రి దుర్గి నాయుడు, నైనంశెట్టి రమణారావు, గూడపు ప్రకాష్, నారిపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

దిబ్బపాలెం విద్యార్థికి ట్రిపుల్ ఐటి సీటు



ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని దిబ్బ పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థి సిరసపల్లి యోగేంద్ర ట్రిబుల్ ఐటీ సీటు దక్కించుకున్నారు. ఒంగోలు ట్రిబుల్ ఐటీ కళాశాలలో యోగేంద్రకు సీటు రావడం పట్ల గ్రామ సర్పంచ్ పీలా ఉషా అప్పారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు పి అచ్చియ్యమ్మ, స్కూల్ కమిటీ చైర్మన్ ఎల్లపు రామచంద్రరావు, పాఠశాల సిబ్బంది, స్కూల్ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.


సమావేశంలో పాల్గొన్న సిపిఎం నాయకులు

నిరసనలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- కె.కోటపాడు

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపైనా, స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం మండల నాయకులు వనము సూర్యనారాయణ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ నుండి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అక్కడ సమస్యలపై సెప్టెంబర్ ఒకటో తేదీన గ్రామ సచివాలయాల వద్ద నిరసనలు చేపట్టి, వినతి పత్రాలు అందిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 4న మండల తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చి సమస్యల పరిష్కరించాలని కోరుతామని చెప్పారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, నిత్యావసరాల ధరలు అరికట్టాలని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, స్వామినాథన్ సిఫార్సుల మేరకు పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, విశాఖ స్టీల్ ప్లాంటు ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని తదితర డిమాండ్లపై నిరసనలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు గండి నాయనబాబు, ఎర్ర దేవుడు, ఓ.దేముడమ్మ పాల్గొన్నారు.


ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ వీరజ్యోతి

'ఫ్యామిలీ డాక్టర్'ను పరిశీలించిన నోడల్ ఆఫీసర్

ప్రజాశక్తి-మునగపాక రూరల్

మండలంలోని ఉమ్మలాడ గ్రామంలో శుక్రవారం జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని జిల్లా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ వీర జ్యోతి సందర్శించారు. వచ్చిన రోగులకు జరిపిన పరీక్షలు, ఇచ్చిన మందులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తపోటు, మధుమేహ రోగులను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ విజయ్ కుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు వివిఎస్ఎం లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి షాహిన్ అంజూమ్, ఏఎన్ఎం గుణలక్ష్మి, మగ ఆరోగ్య కార్యకర్త జ్యోతిలాల్, డీఈవో విజయలక్ష్మి, వినోద్, ఆశా కార్యకర్తలు కావేరి, విజయకుమారి, వరలక్ష్మి పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి విగ్రహ పున:ప్రతిష్ట

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని మారేపల్లి గ్రామం ఉత్తర వాహిని శరద నది ఒడ్డున వెలసియున్న శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి విగ్రహ పున:ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం జరిగింది. దేవాలయానికి మౌలిక సదుపాయ కల్పన, అభివృద్ధి కార్యక్రమాలకు స్వచ్ఛంద విరాళాల సేకరణకు శుక్రవారం ఆలయ అర్చకులు రాంకుమార్ పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. సర్పంచ్ అవుగడ్డ కన్నతల్లి భర్త కోటిపల్లి నాయుడు దంపతులు లక్ష రూపాయలు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులు అవుగడ్డ భరద్వాజ, నెక్కల శ్రీనివాసరావు, అవుగడ్డ అప్పల నాయుడు మాస్టారు, గ్రామ పెద్దలకు చెక్కు రూపంలో అందజేశారు. అదే గ్రామానికి చెందిన అవుగడ్డ రామారావు రూ.5,116 విరాళంగా ఇచ్చారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు



మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగేశ్వరరావు

'ఇష్టం లేనివారు పార్టీని వీడండి'

ప్రజాశక్తి - యలమంచిలి

'పార్టీ సమావేశాలకొచ్చి బాతాకానీ కబుర్లు చెప్పొద్దు. పార్టీకి నష్టం చేకూర్చే దుష్ప్రచారాలు చేయొద్దు. పార్టీ కార్యకలాపాల్లో పాల్గొని పార్టీకే ద్రోహం తలపెట్టవద్దు. అలా ఎవరు వ్యవహరిస్తున్నారో పార్టీ పెద్దలకు తెలుసు. అలాంటి వారు పార్టీ సస్పెండ్ చేయకముందే పార్టీని విడిచిపోవడం మంచిది.' అని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీని నమ్మి అహర్నిశలు శ్రమిస్తున్న, అధికార దుర్మార్గ చర్యల్ని ప్రజల సహకారంతో తిప్పి కొడుతున్న తరుణంలో సొంతపార్టీ నాయకులే చావకింద నీరులా అనేక దుష్ప్రచారాలు చేస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. అన్న క్యాంటీన్ నడపడమే చేతగాని వారు పార్టీనేమి నడుపుతారని విమర్శలకు దిగడం సరికాదన్నారు. ఎన్ఆర్ఐ మహిళా విభాగం ఆధ్వర్యంలో యలమంచిలి పార్టీ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న 'అన్న క్యాంటీన్' నిర్వహణలో నాణ్యత లోపించిన కారణంగా తయారీదారుని మారుస్తున్నామని, ఆ కారణంగా కొంత కాలం క్యాంటీన్ నిర్వహించలేకపోయామని తెలిపారు. సోమవారం నుండి యధాతథంగా 'అన్న క్యాంటీన్' నిర్వహిస్తున్నట్లు నాగేశ్వరరావు ప్రకటించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొర్లె శివనారాయణ, ఆడారి రమణబాబు, రాజాన సూర్య నాగేశ్వరరావు, కొఠారు సాంబ, ఆదిమూర్తి, బొద్దపు రమణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ స్థలం కబ్జాపై ఫిర్యాదు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని ఎ.కొత్తపల్లి అంగన్వాడీ-2 కేంద్రానికి కేటాయించిన స్థలం ఆక్రమణకు గురైందని అంగన్వాడీ కార్యకర్త ఎస్.లీల శుక్రవారం ఐసిడిఎస్ సిడిపిఒకు ఫిర్యాదు చేశారు. ఆ గ్రామంలో అంగన్వాడీ-2 కేంద్రానికి సర్వేనెంబర్ 309లో 5 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని గ్రామపంచాయతీ తీర్మానం చేసి కేటాయించారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ స్థలాన్ని గ్రామంలోని వ్యక్తులు కబ్జా చేసి స్థలం చుట్టూ కంచె వేశారని తెలిపారు. అధికారులు కబ్జాదారులపై చర్యలు తీసుకొని ఆ స్థలంలో అంగన్వాడి భవనాన్ని నిర్మించాలని ఆమె కోరారు.

జనసేన కార్యాలయ నిర్మాణాన్ని అడ్డుకున్న మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి రైల్వే స్టేషన్‌రోడ్డులో నిర్మిస్తున్న జనసేన పార్టీ కార్యాలయాన్ని పునాదుల దశలో మున్సిపల్ అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. ముందస్తు అనుమతులు లేనిదే నిర్మాణాలు చేపట్టరాదంటూ టౌన్‌ప్లానింగ్ అధికారులు జనసేన నాయకులకు వివరించారు. నిబంధనల ప్రకారం అనుమతులు పొందిన తర్వాతే నిర్మాణం చేపట్టాలని సూచించారు. నిర్మాణం కాదని పునాదులు మాత్రమేనని అక్కడ తవ్వుతున్న ప్రహరీ లోపల 'కంటైనర్' కార్యాలయం మాత్రమే ఉంటుందని చెప్పినప్పటికీ అనుమతులు తీసుకోవాలసిందే అంటూ అధికార్లు నచ్చచెప్పారు. అధినాయకుడి సూచనల మేరకు నిబంధనల ప్రకారమే కార్యాలయం నిర్మిస్తామంటూ జనసేన టౌన్ పార్టీ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాసరావు విలేకర్లకు చెప్పారు.


జనసేన కార్యాలయానికి తవ్విన పునాది

మత్తులో జోగుతున్న పల్లెలు

-కిల్లీ బడ్డీల్లో మద్యం విక్రయాలు
-గ్రామాల్లో విచ్చలవిడిగా సారా తయారీ

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలంలో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నియంత్రించాల్సిన అధికారులు కట్టడి చేయలేక పోవడంతో పాటు నెలవారీ మామూళ్లు మత్తు లో మునుగుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో, మద్యం బెల్ట్ షాపులు, నాటు సారా విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతు న్నాయి.

వైసీపీ ప్రభుత్వం బెల్ట్ షాపులను రద్దు చేస్తూ గతంలో జీవో జారీ చేసింది. సుమారు మూడేళ్ల పాటు దాడులు చేసి నియంత్రించారు. గత ఏడాది కాలంగా మద్యం బెల్టు షాపులు అన్ని గ్రామాల్లోనూ గోప్యంగా ఏర్పాటు చేసుకొని మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారు. మండలంలో కొత్తకోట, దొండపూడి, తట్టబంద, లతో పాటు రావికమతంలో రెండు ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. గతంలో మద్యం దుకాణాలు వేలం ద్వారా పొందిన(విక్రయ దారులు) కాంట్రాక్టర్లు ఆయా గ్రామాలలో గ్రామ దేవతల పండగలకు కొంత మొత్తాన్ని ముట్టజెప్పి బెల్టు షాపులను ఏర్పాటు చేసుకునేవారు.అప్పట్లో అన్ని బ్రాండ్‌లలో క్వాటర్ బాటిల్ పై రూ. 5 నుంచి రూ 10 వరకూ కమీషన్ పద్ధతిలో బెల్ట్ షాపులకు సరఫరా చేశారు.ప్రస్తుతం ప్రభుత్వ మద్యం దుకాణాలు కావడంతో బెల్టు షాపులు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి కల్పించ లేదు. ప్రభుత్వం మద్యం దుకాణాలలో బ్రాండ్‌ను బట్టి క్వాటర్ ధర రూ.120 నుంచి రూ 500 వరకూ ఉన్నాయి. దీనికి అదనంగా మరో రూ.50లు కలిపి అమ్మకాలు చేస్తూ మద్యం బాబుల నుంచి దోపిడీ చేస్తున్నారు. ఈ గుట్టు చప్పుడు వ్యాపారానికి వైన్ షాప్ లలో పని చేసే సిబ్బంది సహకారం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. శెలవు రోజుల్లో సిబ్బందే తమ ఇళ్ల వద్ద గుట్టు చప్పుడు కాకుండా స్టాక్ పెట్టు కొని అధిక ధరలకు మద్యం అమ్మకాలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ నిర్వహిస్తుండగా దుకాణాలు తెరవని సమయం లో మద్యం బాబులు రూ.50 లు అదనంగా చెల్లెస్తూ మద్యం కొనుగోలు చేస్తున్నారు.


ఓ బెల్ట్ షాపులో మద్యం

కిల్లి బడ్డీల్లో అమ్మకాలు

కొత్తకోట శివాలయం వీధి (బజారు వీది) వెల్లంకివీధి, కాపుల దిబ్బ, మెయిన్ రోడ్డులో కిల్లి బడ్డి (ఫాన్‌షాప్)లలో విక్రయాలు జరుగుతున్నాయి. డైలీ పోలీసులు విధులు నిర్వ హించే జంక్షన్ లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు కొనసాగుతున్నా పోలీస్ లకు తెలియక పోవడం గమనార్హం. రావికమతం, మేడివాడ, టి.అర్జాపురం, కొత్తపట్నం, కన్నంపేట, తోటకూరపాలెం తదితర గ్రామాలలో మద్యం బెల్ట్ షాప్‌ల ద్వారా విక్రయాలు జోరుగా గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్నాయి.

గ్రామాలలో సారా తయారీ

ఇదిలా ఉండగా రావికమతం మండలంలో మారు మూల గ్రామాలలో నాటు సారా తయారీ కేంద్రాలతో పాటు సారా విక్రయాలు మంచి జోరు మీద కొనసాగుతున్నాయి. కొత్తకోట, రావికమతం పోలీసులతో పాటు చోడవరం ఎక్సైజ్ అధికారులు అడపా దడపా నాటు సారా తయారీ శిబిరాలపై దాడులు నిర్వహిస్తూ సారా తయారీకి సిద్ధం చేసిన పులుపులు ధ్వంసం చేస్తున్నారు. అడపాదడపా కేసులు నమోదు చేసినా గుట్టు చప్పుడు కాకుండా సారా విక్రయాలు కొనసాగుతూనే ఉన్నాయి. సారా విక్రయదారులను పట్టుకున్న సంబంధిత శాఖ అధికారులపై స్థానిక ప్రజా ప్రతినిధుల ఒత్తిడి మేరకు సెటిల్మెంట్లు చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే నాటు సారా తయారీ శిబిరాలపై దాడులు చేసిన ప్రతిసారి తయారీదారులు పరారయ్యారని చెబుతున్న అధికారులపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మద్యం రేట్లు అధికం కావడంతో మద్యం బాబులు చౌకుగా లభించే నాటు సారాపై మక్కువ పెంచుకోవడంతో సారా విక్రయాలు కూడా జోరుగా కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతంలో యువత సారాకు అలవాటు పడి బంగారు భవిష్య త్తును నాశనం చేసుకుంటున్నారు. నాటు సారా విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతుండటంతో మహిళలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఆ దుకాణం పై దాడులు

కొత్తకోట లో అనధికార మద్యం బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగు తున్నాయి. ఆగస్టు 15న కొత్తకోట మెయిన్ రోడ్‌లో ఓ కిల్లి బడ్డి దుకాణంలో మద్యం విక్రయాలు సాగుతున్నట్లు సమాచారం అందడంతో జిల్లా స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఆ దుకాణం పై దాడులు చేసి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి చోడవరం కోర్టుకు నిందితులను తరలించారు.



ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

విద్యార్థుల భారీ ప్రదర్శన

ప్రజాశక్తి -పాయకరావుపేట: చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతమైన సందర్భంగా పాయకరావుపేట వై జంక్షన్‌లో శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు భారీ ప్రదర్శన చేశారు. జాతీయ జెండాను చేతబూని మానవహారాన్ని నిర్వహించారు. భారత్ ఘనతను కొనియాడుతూనే జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఇస్రో శాస్త్రవేత్తల కృషిని శ్రీ చైతన్య సంస్థల ఏజీఎం సురేష్ కొనియాడారు. రీజనల్ ఇన్చార్జ్ గోపీనాథ్ జాతీయ పతాకావిష్కరణ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాణిక్యాలరావు, అకడమిక్ కోఆర్డినేటర్ వెంకట రమణ, డీన్ విజయ్, ఏవో విజయ్, ప్రీ ప్రైమరీ ఇన్చార్జ్ గౌరీ, ప్రైమరీ ఇన్చార్జ్ వేణు ప్రియ పాల్గొన్నారు.

చెరువులోకి మురుగునీరు వదలొద్దు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని కాగిత జాతీయ రహదారి అనుకుని ఉన్న హెూటల్ జాస్ నిర్వాహకులు మురుగునీటిని కాగిత పెద్ద చెరువులో వదులుతున్నారని, నిలిపి వేయకుంటే ఆందోళన చేస్తామని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ హెచ్చరించారు.శుక్రవారం కాగిత గ్రామస్తులతో కలిసి పెద్ద చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెూటల్ జాస్ నుంచి మురుగునీరు నేరుగా పెద్ద చెరువులో కలవడంతో కలుషితం అవుతుందన్నారు. దీంతో న్యాయం పూడి, చినదొడ్డిగల్లుకు చెందిన పాడి పశువులు చెరువులో కలుషిత నీరు తాగి వ్యాధుల బారిన పడుతున్నాయని తెలిపారు. చెరువు లో నీరు దుర్వాసన వెదజల్లడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. హెూటల్ జాస్ మేనేజర్‌కు సమస్యను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అడపా గణేశ్వరావు, దేవవరపు రామకృష్ణ, దేవవరపు ఉమా మహేశ్వర రావు, యర్రంశెట్టి సుభాష్, గుమ్మెళ్ళ వెంకటేష్, మాదాసు కరుణాకర్, యర్రంశెట్టి శ్రీను, గుమ్మెళ్ళ దొరబాబు, దేవవరపు సతీష్ ,పోల్నాటి గణేష్ , గుమ్మెళ్ళ సాయి, సాయిరాం పాల్గొన్నారు.


చెరువును పరిశీలిస్తున్న వెంకటేష్, నాయకులు

పివిటిజిల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-కొత్తకోట: ప్రధానమంత్రి పివిటిజి డెవలప్మెంట్ మిషన్ పథకం లో మైదాన ప్రాంతం అదిమ తెగల ఆదివాసీ లను చేర్చాలని ఏపీ ఆదివాసీ హక్కుల సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నల్లి కళ్యాణం, అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం రాష్ట్ర కార్య వర్గ సభ్యులు ఎం.రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 15 వేల కోట్లతో కేంద్ర ప్రభుత్వం ఆదిమ తెగలగా గుర్తింపబడిన ఆదివాసీలకు ఒక ప్రత్యేకమైన అభివృద్ధి కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు.. దీనికి ప్రధానమంత్రి పివిటిజి డెవలప్మెంట్ మిషన్‌గా పేరు పెట్టారన్నారు ఈ ప్రత్యేక పథకం కింద ఆదిమతెగలకు చెందిన ఆదివాసి గ్రామాలలో విద్య, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు ప్రకటన చేసారని,కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను సరించి 2021వ సంవత్సరంలో అప్పటి ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పివిటిజి ఆదివాసి ఆవాస గ్రామాల వివరాలను సేకరించారన్నారు. గత ఏడాది మే నెలలో విశాఖపట్నం జిల్లా విభజన కారణంగా పాడేరు ఐటిడిఏ అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలిసిపోవ డంతో అనకాపల్లి జిల్లాలో ఉన్న పివిటిజి ఆదివాసి గ్రామాలు అభివృద్ధి కి నోచుకోలేదని వాపోయారు. పలు డిమాండ్లు తో కూడిన వినతిపత్రాన్ని శుక్రవారం పాడేరు ఐ టి డి ఏ కార్యాలయంలో పివో అందజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమం లో అఖిల భారత్ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పి ఎస్ అజెయ్ కుమార్, గిరిజన సంఘం నాయకులు గోరా చిరంజీవి, పవన్ తదితరులు పాల్గొన్నారు..


యంత్రాలు అందజేస్తున్న సింహాద్రప్పడు

గడ్డి కోత యంత్రాల పంపిణీ

ప్రజాశక్తి -కోటవురట్ల: సబ్సిడీపై పాడి రైతులకు గడ్డి కోత యంత్రాలు మండల కేంద్రంలోని పశువైద్యశాల వద్ద శుక్రవారం పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు సింహాద్రప్పుడు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 25 గడ్డి కోత యంత్రాలు 40శాతం సబ్సిడీతో పంపిణీ చేసినట్లు తెలిపారు. ఒక్కో గడ్డి యంత్రం రూ.33,970 కాగా 20,380లకు అందజేశామన్నారు. పాడి రైతులకు ఎంతో ఉపయోగకరంగా పనిచేస్తాయని గడ్డి వృధా కాకుండా వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.


బీటలుబారిన కార్యాలయం

శిథిలావస్థలో ఎంఇఓ కార్యాలయం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో విద్యాశాఖ అధికారి కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్యాలయం నిర్మించి 24 సంవత్సరాలకే శిథిలావస్థకు చేరుకుంది. దీంతో, కార్యాలయంలో విలువైన సామాగ్రి పాడైపోతున్నట్లు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా భవన నిర్వహణకు నిధులు కేటాయించాలని కోరుతున్నారు.


పట్టుబడ్డ టేకు దుంగులను పరిశీలిస్తున్న అధికారులు

20 టేకు దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-గొలుగొండ: స్థానిక సెక్షన్ అటవీశాఖ అధికారి లక్ష్మణ ఆధ్వర్యంలో శుక్రవారం కొయ్యూరు మండలం కంఠారం గ్రామ సమీపంలో తరలించడానికి సిద్దంగా ఉంచిన 20 టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై అధికారులు గ్రామంలో విచారణ చేయగా కలప నిల్వ చేసిన వారి వివరాలు తెలియక పోవడంతో ప్రత్యేక వాహనంలో ఈ దుంగలను గొలుగొండ అటవీ శాఖ డిపో కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారి లక్ష్మణ మాట్లాడుతూ, సెక్షన్ పరిధిలో అనుమతులు లేకుండా టేకు కలప తరలించినా, నిల్వ చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన సూచించారు.

తహశీల్దార్ ఆకస్మిక బదిలీ

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: నర్సీపట్నం తహశీల్దార్ రవికుమార్ ఆకస్మికంగా బదిలీ అయ్యారు. ఈ నెల 21న తహసిల్దార్గా బాధ్యతలు చేపట్టిన రవికుమార్‌ను నాలుగు రోజుల వ్యవధిలోనే మునగపాక తహశీల్దార్గా బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. నర్సీపట్నం తహసిల్దారుగా అన్నాజీరావుకు బాధ్యతలు అప్పగించారు.

మినీ గోకుల షెడ్ల బిల్లులు చెల్లించేదెన్నడో?

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో గత టిడిపి ప్రభుత్వ హయాంలో పాడి రైతులకు మినీ గోకులాల షెడ్ల నిర్మించేందుకు అప్పట్లో 15 మందికి 18లక్షల రూపాయలు నిధులు మంజూరయ్యాయి. దీని నిర్మాణానికి రైతు వాటా పది శాతం చెల్లించి మినీ గోకులాల పేరుతో నిర్మాణాలు చేపట్టారు. అనంతరం 2019 ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం వచ్చింది. అప్పటి నుంచి షెడ్లు నిర్మించుకున్న రైతులు బిల్లుల కోసం వెటర్నరీ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయింది.రైతులంతా స్వయంగా పెట్టుబడి పెట్టి షెడ్లు నిర్మించుకోగా సాయిబాలాజీ కంపెనీకి నిధులు మళ్లించామని జిల్లా అధికారులు చెబుతున్నట్లు ఎన్.కొత్తూరుకు చెందిన రైతులు రెడ్డి సత్యనారాయణ, కొమరవోలు గ్రామానికి చెందిన ఆదపురెడ్డి పైడియ్యనాయుడు తదితరులు విలేకర్ల వద్ద వాపోయారు. రైతులు స్వయంగా తమ షెడ్లను వారే నిర్మించుకోగా సాయిబాలాజీ కంపెనీ పేరుతో నిధులు మళ్లించడం ఏమిటని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి పూర్తి విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఐదేళ్లు గడిచింది

మినీ గోకులాల షెడ్లు నిర్మించుకొని ఐదు సంవత్సరాలు కావస్తోంది. రైతు వాటాగా డిడి తీసుకొని ఆరు సంవత్సరాలు కావస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బిల్లులు తమకు అందజేయాలి.



ఆదపురెడ్డి పైడియ్యనాయుడు, రైతు

నిధులు మార్చుకోవడం తగదు

టీడీపీ ప్రభుత్వంలో రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో అప్పట్లో నిధులు మంజూరు చేశారు. రైతులంతా స్వయంగా పెట్టుబడి పెట్టి షెడ్లు నిర్మించుకున్నారు. ఎవరో కాంట్రాక్టర్ నిర్మించాడని సాయిబాలాజీ కంపెనీ పేరుతో నిధులు మార్చుకోవడం ఎంత వరకు సమంజసం. ఇప్పటికైనా పాడి రైతులకు న్యాయం చేయాలి.



బంటు రామునాయుడు
రైతు

కలెక్టర్ ఆకస్మిక పర్యటన

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలో జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి ఆకస్మికంగా పర్యటించారు. సురవరం కస్తూరిభా గాంధీ బాలికా విద్యాలయం పరిశీలించి, మెను విద్యపై ఆరా తీశారు. డ్రాప్ ఔట్స్ వివరాలు అడిగారు. మధ్యలో చదువు ఆపిన పిల్లల వివరాలు వాలంటీర్ల, వెల్ఫేర్ అసిస్టెంట్లు సేకరించాలని ఆదేశం చారు. కే జె పురంలో జగనన్న లే అవుట్‌లను పరిశీలించి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఆకస్మిక పర్యటన తో అధికారులు కంగారు పడ్డారు.



మాట్లాడుతున్న కలెక్టర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

30 నుంచి నిరసనలు : సిపిఎం

ప్రజాశక్తి-గొలుగొండ:కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 30 నుండి సెప్టెంబర్ 4 వరకు జరిగే నిరసన కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొనాలని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం గొలుగొండ మండలం జోగుంపేటలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడిగర్ల రాజు మాట్లాడుతూ, బిజెపి విధానాలు ప్రజలకు గుదిబండగా మారుతున్నాయన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే రద్దు చేసి, నిత్యావసర వస్తువుల ధరలు అరికట్టాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేయరాదన్నారు. గ్రామీణ ఉపాధికి నిధులు పెంచాలని, రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి మాట్లాడుతూ, గొలుగొండ మండలంలో వివిధ రకాల ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న గిరిజనలకు, రైతులకు సాగు నమోదు చేసి, పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటి సభ్యులు సిహెచ్.రాము, రాజు, పండియ్య, సత్తిబాబు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



నిరసన చేపట్టిన సిబ్బంది

పశువైద్య అంబులెన్స్ సిబ్బంది ధర్నా

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: ప్రభుత్వం జీవో ప్రకారం జీతాలు ఇవ్వలేదని పశువుల అంబులెన్స్ సిబ్బంది శుక్రవారం స్థానిక పశు వైద్యశాల వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలో భాగంగా ఈ సేవలను నిలిపివేస్తున్నట్టు తెలియజేశారు. అంబులెన్స్‌లో పశు వైద్యుడు, వెటర్నరీ డిప్లొమా సహాయకుడు, డ్రైవర్ కమ్ అటెండర్లు ఉంటారనీ చెప్పారు. జీవో ప్రకారం డాక్టర్లకు రూ.56 వేల ఇవ్వాల్సి ఉండగా రూ.40 వేలు ఇస్తున్నారని, పారా వెట్ లకు రూ.20వేలకు గాను 15000, డ్రైవర్లకు రూ.18వేలకుగాను 12వేలు మాత్రమే ఇస్తున్నారని ఆమె తెలిపారు. ఇంక్రిమెంట్లు ఇవ్వలేదని, ప్రతినెల జీతాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కే.హరిత, అశోక్, దుర్గాప్రసాద్, రేణుక, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలు



విశాఖలో పూజలు చేస్తున్న మహిళలు



వేషధారణలతో ఆకట్టుకున్న చిన్నారులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శ్రావణమాసం రెండో శుక్రవారం, వరలక్ష్మి వ్రతం సందర్భంగా విశాఖ నగరంలోని ఆలయాలన్నీ మహిళా భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా మహిళా దేవతల ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాత నగరం బురుజుపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి వేలాదిమందిగా భక్తులు తరలివచ్చారు. అలాగే వన్ టౌన్ ప్రాంతంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయం, దొండపర్తి జంక్షన్‌లోని ఎరుకులమ్మ ఆలయం, పూర్ణామార్కెట్‌లోని దుర్గాలమ్మ ఆలయాలకు తెల్లవారు జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్నిచోట్ల భక్తుల తాకిడి అధికంగా ఉండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

కిడ్స్ గార్డెన్ స్కూల్‌లో..

ఎంవిపి.కాలనీ : ఉషోదయ జంక్షన్ వద్దగల కిడ్స్ గార్డెన్ పబ్లిక్ స్కూల్‌లో వరలక్ష్మి వ్రత వేడుకలను ఘనంగా నిర్వహించారు. వరలక్ష్మి, అష్టలక్ష్మి అవతారాలను ధరించి పిల్లలు ఆకట్టుకున్నారు. అమ్మవారి వేషధారణలు వేసిన చిన్నారులు అమ్మవారి పాటలను, పద్యాలను ఆలపిస్తూ అందరినీ అలరించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాయిలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోటవురట్ల:మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే శ్రావణ శుక్రవారం మహాలక్ష్మి అమ్మవారి వ్రతం మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మహిళలు దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. రెండు రోజుల నుంచి మార్కెట్‌లో శ్రావణ శోభ సంతరించుకుంది. ప్రధానంగా పండ్లు, పూలకు డిమాండ్ ఏర్పడింది.

వైభవంగా తిరువీధి సేవ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక వెంకన్న ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా గోదాదేవి అమ్మవారి తిరువీధి సేవ వైభవంగా నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆలయంలో ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం రాజ వాహనంపై అమ్మవారి ఉత్సవమూర్తిని మాడవీధుల్లో హరినామ సంకీర్తనతో ఊరేగించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పండ్ల నైవేద్యాలను సమర్పించారు. అనంతరం ఆలయంలో గోదాదేవి అమ్మవారి మూలవిరాట్ సన్నిధిలో అమ్మవారికి సహస్ర కుంకుమ పూజ చేశారు.



ఊరేగిస్తున్న భక్తులు

మత్స్యకారులపై కేసుల నమోదు తగదు

ప్రజాశక్తి -నక్కపల్లి:బాపట్ల జిల్లా రామాపురం గ్రామంలో 160మంది మత్స్యకారులపై అన్యాయంగా కేసులు బనాయించి, చిత్రహింసలకు గురి చేసారని, వారికి న్యాయం చేయాలని జాతీయ మత్స్యకార సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మత్స్యకార నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశంలో మత్స్యకార నాయకులు మాట్లాడుతూ, రామాపురం మత్స్యకారులపై పోలీసులు అక్రమ కేసులు బనాయించి, మహిళలని చూడకుండా వారిపై ప్రవర్తించిన తీరు చాలా బాధాకరని ఆవేదన వ్యక్తం చేశారు..ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మత్స్యకారులకు న్యాయం చేయకుంటే రాష్ట్రం అంతటా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జాతీయ మత్స్యకార సంఘ జిల్లా నాయకులు కొవిరి వెంకటేష్, గరికిన సింహాద్రి, పిక్కి కొదందరావు, పేర్ల శ్రీను, వాసుపల్లి శివ, సిరిపిల్లి అప్పలరాజు, వాసుపల్లి రాము, కారే తాతాజీ, కంబాల అమ్మోరియ్య, కొడ చిట్టిబాబు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న మత్స్యకార నేతలు

పాడేరులో భారీ వర్షం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం భారీ వర్షం కురిసింది. మన్యంలో ఆయా మండలాల్లో ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. పాడేరులో ఉదయం నుంచి మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు ఎండ వాతావరణం కొనసాగి, ఆ తర్వాత వాతావరణం మారి పోయింది. నాలుగు గంటల తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారింది. ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటలసేపు కురిసిన వర్షానికి పాడేరు పట్టణం తడిచి ముద్దయింది. దీంతో పాడేరులోని రోడ్లన్నీ చిత్తడిగా మారి, జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు వాహనాలను ఎక్కడి కక్కడే నిలిపి వేశారు. పలువురు వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. అనంతగిరి మండలంలోని పలు చోట్ల వర్షం కురిసింది. వర్షాలకు రోడ్లు బురదమయంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. రోడ్లన్నీ చిత్తడిగా మారి, జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది.



పాడేరులో కురుస్తున్న వర్షం